# దండ వేయించుకున్న దేవుడు

పగలంతా ఒళ్ళు హూనమయ్యేలా పంజేసి ఇంటికి జేరుకున్న జోగులు గట్టిగా దేవుణ్ణి పిల్చాడు. 'దేవు'డంటే ఉన్నాడో, లేదో తెలీని ఆ మాయదారి దేవుడు కాదు. జోగులుకి - అదే, జోగులు భార్యకి – రెండుసార్లు పిల్లలు పుట్టి, పుట్టిన మూడోరోజునే కన్నుమూసిన కారణంగా, "ఈసారి పిల్లాడుడితే నీ పేరెట్టుకుంటా దేవుడా!'' అని జోగులు మొక్కుకోగా, పుట్టిన కుర్రాడే 'దేవుడు'.

"ఒరే దేవుడుగా!"

'అయ్య' తాలూకు రెండో పిలుపు విన్పిస్తేగాని ఓ పట్టాన పలకడు దేవుడు.

"యెక్కడ సచ్చేవురా దేవుడా?"

కొడుకు నుద్దేశించి, మితిమీరిపోతున్న కోపంతో గావుకేక పెట్టాడు జోగులు.

"ఊఁ – అన్నాను, నువ్విన్పించుకోపోతే నే నేటి సెయ్యను? మేష్టారు గారు రేపొద్దున్న 'స్లిప్పు - టెస్టు' పెడ్తానన్నారు. సదూకోపోతే-"

"ఎదవ, ఎదవసదువూ నువ్వూను. సెప్పులు కుట్టుకునేవోడి కొడుక్కి సదువెందుకురా సన్నాసీ!'' తండ్రి మాటకు జవాబు వెదుక్కుంటున్న 'దేవుడి'కి దేవుళ్ళా అడ్డువచ్చి నిల్చుంది దేవుడి తల్లి 'నర్సియమ్మ'. 'నర్సియమ్మ'కు లోకజ్ఞానం అపారం. న్యూస్ పేపర్లూ, ఆలిండియా రేడియోలూ వినదుగాని, మినిష్టర్ల గురించీ, రాజ్యాంగాన్ని గురించీ, హిందూదేశంలోని దరిద్రం గురించీ 'లాజికల్'గా గంటలతరబడీ తన 'యాసభాష'లో ఏకధాటిగా మాట్లాడ గలనేర్పరి.

అంతసేపూ వంటింట్లో పొయ్యి

అందే గోపాలకృష్ణమూర్తి

రా జేస్తున్న నర్సియమ్మ దేవుణ్ణి తన మొగుడు అతి కించపర్చడం సహించ లేకపోయిందో ఏమో, ఒక్కసారిగా విరుచుకుపడింది.

"య్యేటి తక్కు వొచ్చినాది నీ గుంటడికి? ఆడు సదూంకోపోతే నువ్వా నేనా సదుంకునేది? ఆడి బాబు సెప్పులు కుట్టుకునేవో డైతే ఆడు సదూకోకూడదని రూ లెక్కడుంది? ఆడి అమ్మ అంట్లు తోంకొనే దైతే ఆడు రేపు రాజ్య మేలకూడదని రూ లెవరెట్టేరు? ఆడికి కులం తక్కువైతే సదూకోడానికేం ముప్పురాదే! ఆడు సదుకుంటాడు, బియ్యేలు, యెమ్మేలు పేసవుతాడు. కలెట్ట రవుతాడు, కారుల్లో తిరుగుతాడు; కావోప్తే, మినిష్ట రౌతాడు, రాజ్జాన్నేల్తాడు, ఆడి కేటి తక్కువ — ఎంత మంది కలెట్టర్లూ, మినిష్టర్లూ సిన్నప్పుడు కాయకష్టం జేసుకు బతికే కూలోళ్ళ కుటుంబాల్లో పుట్టలేదు? ఆళ్ళ అదురుష్టం పండింది, ఆళ్ళ గీత బావుంది, ఆళ్ళ కన్నోళ్ళ నోంవులు పలించినై; గొప్పింటోరై కూచున్నారు. అట్టాగే, నా బాబు, నా దేవుడుకూడా మినిష్టరై పోతాడు. కావోప్తే కలెట్టరన్నా ఐపోతాడు. ఆడి కళ్ళల్లో సూడు — మహారాజు కళ — మెళ్ళో దండ లెయ్యించుకుని ఊరేగుతాడు. జనాలు దండాలు పెడ్తారు. అప్పుడుగాని ఆడి సత్తా నీకు తెల్దు!"

"ఆఁ — ఊరేగుతాడు దండ లెయ్యించికుని! ఆడి మోహానికీ నాకూ అదే తక్కువై పోనాది! నుయ్యోళ్ళి పంజూసుకో — యెదవ మొగం నువ్వూను! దీని కొడుకు మినిష్టరై పోతాట్ట — దండ లెయ్యించుకు ఊరేగుతాడట! ఎదవనాయాల— యేరా, అలా దాని యెనకాల నక్కి నీలుగుతావ్; నడు, రాత్తిరంతా పనున్నాది. యినస్పిట్టరుగారు బూట్లు పాలీసు సెయ్యమన్నారు. వొకటీ రొండూ కాదు, నలభై జతలు; నిగనిగ నాడిపోవాల! ఆఁ—, ఆళ్ళు తుపాకు లెట్టుకునే 'బెల్టు'లు కూడా మన పాలీసుతో మెర్సిపోవాలట! ఆ బాబుకి — ఆ 'యస్సయ్య' బాబుకి — మనమీద కనికారం కల్గి ఆ బేరాన్కి నన్ను పిలిసినారు. నేకపోతేనా, ఆ నర్సింవులుగాడు—గోతికాడ నక్కలా కాసుక్కూసున్నాడు. రేత్తిరంతా కష్టవడి ఆ పని తెమల్చాల! తెల్లారేసరికి 'ఇనస్పిట్టరు' గారూ, జమాన్లూ బందోబస్తు కెళ్ళాలిట! 'ఇస్టూడెంటు కుర్రోళ్ళు' యేదో గొడవ సేస్తున్నారటగా — అందుకు."

దేవుడు 'అలా గేలే అయ్యా' అన్నాడు. ఆనక 'ఇస్టూడెంటు కుర్రోళ్ళు' గొడవ లెందుకు చేస్తు

న్నారో చెప్పేడు.బియ్యేలు, ఎమ్మేలు సదివేవోళ్ళతోబాటు 'యిస్కూలు కుఱ్ఱోళ్ళు'కూడా గొడవల్లోకి యెళ్తా రనికూడా 'అయ్య'కి తెలియజేసేడు దేవుడు 'ఆటి జోలికి నువ్వెళ్ళమాక ఎదవా!' అని మందలించాడు జోగులు కొడుకుని.

*　　　*　　　*

"జోగుతావేరా యెదవా; యింక నాలుగు జెతలే వున్నయ్, జోరుగా పాఁవు రంగు; ఇలా సూడు, ఇది 'యెస్సయ్య'గోరి బూట్సుల జెత; దీనికి బాగా రంగెయ్యాల. పాలీసు ధగధగా మెర్సిపోవాల. ఒరి నిదర మత్తునాయాల, సురుగ్గా సెయ్యరా'. జోగులుకూడా జోగుతూనే దేవుణ్ని మందలించాడు. ఆవులిస్తూనే పని సాగించాడు దేవుడు. అమాయకంగా, తనతోబాటు తెల్లార్లూ పని చేసిన కొడుకని చూసేసరికి ఆ క్షణాన జోగులి మనస్సు కలుక్కుమన్నది. కొడుకుమీద అకస్మాత్తుగ అనురాగం, ప్రేమా పెల్లుబికిపోయినయ్. నిద్ర మత్తుతో మూతలు పడ్తున్న కొడుకు కళ్ళల్లో ఏదో వింతకాంతీ, కళా కొట్టొచ్చినట్టు కన్పడినయ్ జోగులికి. ఏమో, నా కొడుకు గొప్పొడై పోతాడేమో! ఔను, ఎందుక్కాకూ డదు? ఆడు గొప్పోడైతే, ఆ రోజుకి తను బతికుంటే, తను చెప్పులు కుట్టు కుంటూ ఎలా బతగ్గలడు? అది ఆడి 'హోదా'కి నామోషీ కాదా?–' కొడుకు భవిష్యత్తునుగూర్చి తియ్యటి కలలు కంటూ కునుకు తీశాడు జోగులు.

కళ్ళు తెరిచేసరికి ఎదురుగా ఎఱ్ఱ టోపీ! ఉలిక్కిపడి 'కెవ్వు'న కేక వేశాడు జోగులు. "ఏరా వెధవా, అలా అరుస్తావ్? యెస్సయ్‌గారు బూట్లు అర్జెంటుగా పట్రమ్మన్నారు, లేలే! నిముషంలో రావాలి–" హుకుం జారీచేసి 'లాఠీ' ఊపుకుంటూ, బూట్లు 'టకటక' లాడించుకుంటూ హుం దాగా వెళ్ళిపోయాడు పోలీసు!

'హమ్మయ్య!' అనుకొని, తేరుకుని అక్కడే కూలబడి మూడంకె వేసి కునుకు తీస్తున్న కొడుకుని తట్టి లేపాడు జోగులు.

*　　　*　　　*

"మా అయ్యా, నేనూ తెల్లార్లూ పాలీసు పెట్టాం పోలీసోళ్ళ బూట్లకి. ఆ యెస్సయ్యగారి తుపాకీబెల్టుకి నేనే పాలీసు చేసేను – చూసేవా యెలా ధగధగా మెర్సిపోతుందో! నడ్డా, ఆళ్ళతోబాటు యెళ్ళి చూద్దాం యేటి జరుగుద్దో! ఈయేళ కాలీజీవోళ్లు 'స్ట్రయికు' బాగా చేస్తన్నారటగా–" దేవుడిమాట వింటూనే ఇంట్లోకి పరుగు తీశాడు–వాడి క్లాసుమేటు 'సన్నాసి'.

'ఒరీ యెదవ సన్నేసీ! ఆడదాని

కంటేపిరికి యెదవ్విరా! పోలీసంటే భయ్యం, బూట్లంటే భయ్యం, తుపాకు లంటే భయ్యం - ఇం కెలా బతుకు తావురా? రాత్రంతా ఎన్నిబూట్లకి మెరుగు పెట్టేం? ఎన్ని తుపాకీబెల్టు లికి రంగు పూసేం? నీలా నేనూ దాన్ని చూడగానే పరుగు లంకిస్తే, మాకు ముద్ద దొరికే దెలా?" అంటూనే కాలేజీ వెంపు పరుగెత్తాడు దేవుడు.

* * *

ఊరంతా గగ్గోలు! ఎక్కడ చూసినా హాహాకారాలు! ఇంట్లో లేని పిల్లలతాలూకు తల్లిదండ్రుల ఆక్రందన!!

ఊళ్ళో పోలీసుకాల్పుల్లో ఆరుగురి దుర్మరణం!

"యిన్నావుటే నర్సియ్యమ్మా! ఇస్టూడెంటు కుర్రోళ్ళకీ, పోలీసోళ్ళకీ పేచీ వొచ్చి, పోలీసోళ్ళు కాల్చేస్తే, ఆరుగురు కుర్రాళ్లు అక్కడికక్కడే రక్తం కక్కుకు సచ్చేరట!"

పక్కింటి ముత్యాలమ్మ మాట వినేసరికి గుండె ఝల్లుమన్నది నర్సియ్యమ్మకి. "హాయ్యో! దేవుడుగాడు పొద్దుటేల పోయేడు. కూటికైనా యింకా లాలేదు; యేమైనాడో, యేటో — నే నేటి సెయ్యాను? ఓరి దేవుడుగా - యేడకు పొయ్యేవురా?" కంపించిపోతూ, నెత్తి బాదుకోసాగింది నర్సియ్యమ్మ.

"ఆడి కేటి, ఊరుకోయే. ఆడి అయ్యతో ఏడకో యెల్లుంటాడు. నువ్వలా బెంబేలుపోతావెట్టా? మా బాగుంది—" అక్కడే కూలబడుతూ నర్సియ్యమ్మను సముదాయించింది ముత్యాలమ్మ.

రెండయింది—

దేవుడు రాలేదు!

మూడైంది —

దేవుడు రాలేదు!

నర్సియ్యమ్మకు ఏడుపుమాత్రం ఒక్కుమ్మడిగా వచ్చింది!

నాలుగైంది!

దేవుడు రాలేదు! నర్సియమ్మకు ఏడవలేక శోష వచ్చింది!

ఐదైంది!

'పొద్దున కాల్చేసినోళ్ళ శవాలికి దండలేసి కుర్రోళ్లు ఊరేగిస్తున్నా'రన్న కబురొచ్చి, గుండె బాదుకుంటూ లేచి కూర్చుంది నర్సియమ్మ. తనచుట్టూ ఉన్న తన శ్రేయోభిలాషులంతా మౌనంగా, భయంగా, భయంకరంగా నిల్చుని, తనను గుచ్చిగుచ్చి చూస్తూ వుండేసరికి అవ్వకూడనిదేదో అయిపో యిందనే నిశ్చయాని కొచ్చి 'బావురు' మంటూ విరుచుకుపడింది.

ఐదుంబావయింది!

మెళ్ళో దండలేసుకుని ఊరేగుతూ వచ్చేడు దేవుడు! కాదు - దేవుడి శరీరం!

"నీకు నూకలు మిగల్లేదురోయ్ దేవుడా! నువ్వేటి సేసినావురా నా దేవుడా! అయ్యో దేవుడా! నే నేటి సేసేదిరోయ్ దేవుడా! ఓరి దేవుడా-" నర్శియమ్మ 'చావురంగం'లో నిజం దేవుణ్ని పిలుస్తూ, తన కొడుకు 'దేవుణ్ని' ప్రజల భుజాలపైన-చామంతి దండలమధ్య చూసి, ఒక్క-ఉదుటున లేచి, నెత్తి నోరూ బాదు కుంటూ, జుట్టు పీకేసుకుంటూ, ఓపి కున్నంతవరకూ ఏడ్చి, రాగాలాపాన చేస్తూనే స్పృహ కోల్పోయి నేలమీద కూలిపోయింది.

అలా ఎంతసేపైందో ఏమో, మళ్ళీ కళ్లు తెరిచి చూసేసరికి, చుట్టూ చీకటి మాత్రం కన్పించింది నర్శియ్యమ్మకి. ఏదో మర్చిపోయిన విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటున్నట్టుగా ప్రయత్నిస్తూ, ఒక్క-సారిగా 'అయ్యో నా దేవుడా!' అంటూ రాగాలాపన ప్రారంభించింది. ఎవరో వచ్చి "ఊరుకో నర్శియమ్మా! యేటి సెయ్యగలం? మనం పేదింటోళ్ళం. మనం సచ్చినా బతికినా వొకటే. మన కొడుకుల్ని పోలీసులు కాల్సి సంపేసినా మనం మాటాడనేం. అన్నేయంగా సచ్చిపోయినా నీ కొడుకు గొప్పసావే సచ్చేడు. సదుకో పోయినా సదూకున్న గొప్పింటోళ్ళ భుజాలమీద ఊరేగేడు. దండ లెయ్యిం చుకు ఊరేగేడు. దేవుడంటే ఫలానా వోడని అందరికీ తెలిసేట్టుగా సచ్చిపో యేడు. యేటి సెయ్యగలం?

"ఊరుకో, నర్శియమ్మా ఊరుకో. యెల్లు, ఆస్పత్రి కెల్లు. దేవుడి శవం పట్టించుకురా. మీ ఆయన అక్కణ్నే మూర్ఛబోయి పడిపోనాడు," అని అన్నారు.

చుట్టూ చూసింది నర్శియమ్మ. ఒక్క-సారిగా విజృంభించి, పిచ్చిదాన్లా అరుస్తూ ఆస్పత్రివెంపు పరుగుతీసింది - దండ లెయ్యించుకున్న దేవుణ్ని కడ సారి చూసేందుకు!

